సాక్షి ఒడిశా


ఆదివారం । 10 । సెప్టెంబర్ । 2023



శ్రీ మందిరం ఆదాయం లెక్కింపు

నగదు	రూ. 6,32,436
బంగారం	18.900 గ్రాములు
వెండి	90.200గ్రాములు


– భువనేశ్వర్/పూరీ



నందన్‌కానన్‌కు కొత్త అతిథులు

మిజోరాంలోని ఐజ్వాల్ జూ నుంచి నందన్‌కానన్ జూలాజికల్ పార్క్ (ఎన్‌జెడ్‌పీ)కి ఐదు కొత్త జంతువులు వచ్చాయి.

- IIలో



వన్ భోజీ.. వహ్వాజీ

పూరీ శ్రీ జగన్నాథుని ఆలయం రత్న వేదికపై శ్రీ జగన్నాథుడు వన్ భోజీ అలంకరణతో అలరించారు.

- IIలో

న్యూస్‌రీల్

అలుగు విక్రయిస్తున్న వ్యక్తులు అరెస్టు



స్వాధీనం చేసుకున్న అలుగుతో అటవీ అధికారి

జయపురం: సబ్ డివిజన్ పరిధి బొయిపరిగుడ సమితి రామగిరి అటవీ ప్రాంతం బొడొపాడ గ్రామంలో ఇద్దరు వ్యక్తులు విలువైన అలుగును అమ్ముతున్న సమయంలో రామగిరి అటవీ విభాగ సిబ్బంది దాడిచేసి పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. అడవిలో కొంతమంది వ్యక్తులు అలుగును వేటాడి పట్టుకున్నారు. దీనిని అమ్మేందుకు భువనేశ్వర్‌లోని ఒక వ్యక్తి ద్వారా సంప్రదింపులు జరిపారు. అలుగును రూ.16 లక్షలకు అమ్మేందుకు బేరం కుదిరింది. ఈ విషయం తెలుసుకున్న అటవీశాఖ అధికారులు దాడి జరిపి అలుగును స్వాధీనం చేసుకోవడంతో పాటు, అమ్మకానికి పెట్టిన ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. అరెస్టైనవారు ధూర్జ్య మఠపాడియ, కార్తీక హరిజన్‌లుగా అటవీ డివిజన్ అధికారి రంజిత కుమారి నాయక్ వెల్లడించారు.

లంచం తీసుకొని పట్టుబడిన పోలీసులు

- ఇద్దరు ఏఎస్‌ఐలు, కానిస్టేబుల్ అరెస్టు



అరెస్టైన ఏఎస్‌ఐలు సంతోషిని సాహు, రోనలి పాణిగ్రాహి

బరంపురం: లంచం తీసుకున్న ఇద్దరు ఏఎస్‌ఐలు, ఒక కానిస్టేబుల్‌ను అరెస్టు చేసిన ఘటన శనివారం చోటుచేసుకుంది. బరంపురం ఎస్పీ సార్వణ్ వివేక్ తెలిపిన వివరాలు మేరకు.. గొళంతరా పోలీసుస్టేషన్ పరిధి హోల్డియాపదర్ ఓవర్ బ్రిడ్జి దగ్గర వారం రోజుల క్రితం రెండు పికప్ వ్యాన్‌లలో ఆంధ్రప్రదేశ్ నుంచి ఒడిశాకు తరలిస్తున్న ఆవులను సరిహద్దు గిరిసిల చెక్‌పోస్టు వద్ద గొళంతరా పోలీసులు పట్టుకొని సీజ్ చేశారు. అయితే కేసు లేకుండా ఉండాలంటే రూ.50 వేల లంచం ఇవ్వాలని ఏఎస్‌ఐలు సంతోషిని సాహు, రోనలి పాణిగ్రాహిలు వ్యాన్ డ్రైవర్ పి.నాగభూషణంకు డిమాండ్ చేశారు. దీంతో సంతోషిని సాహు బ్యాంక్ అకౌంట్‌కు తొలుత రూ.30 వేలు అనంతరం మరో రూ.10 వేలు పంపాడు. అయితే మరో రూ.10 వేలు ఇవ్వాల్సిందేనని ఏఎస్‌ఐలు ఒత్తిడి చేయడంతో వ్యాన్ డ్రైవర్ పి.నాగభూషణం ఎస్పీ సార్వణ్ వివేక్‌కి ఫిర్యాదు చేశాడు. ఎస్పీ పక్కాగా దర్యాప్తు చేసి సాక్ష్యాలు సేకరించి ఏఎస్‌ఐలు సంతోషిని సాహు, రోనలి పాణిగ్రాహిలతో పాటు ఒక కానిస్టేబుల్‌ను అరెస్టు చేశారు.

అక్రమ మద్యంపై ఉక్కుపాదం



సీజ్ చేసిన మద్యం బాటిళ్లతో పోలీసులు

బరంపురం: గంజాం జిల్లాలో అక్రమమద్యంపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. కలెక్టర్ దివ్యజ్యోతి పరిడా, ఎస్పీ జగమోహన్ మీనా అక్రమమద్యం విక్రయాలపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. గంజాం జిల్లా బడగడా పోలీస్ స్టేషన్ పరిధిలోని గౌడాగౌడా, గౌడాచిల్లి గ్రామాల్లో నిబంధనలు అతిక్రమించి అక్రమంగా అనుమతులు లేకుండా మద్యం అమ్ముతున్న దుకాణాలపై పోలీసులు దాడులు ముమ్మరం చేశారు. అధికసంఖ్యలో మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ విలేకర్లకు తెలిపారు.

గణపయ్యలు రెడీ

- విభిన్న రూపాల్లో వినాయకుడు
- జోరుగా సాగుతున్న అమ్మకాలు

పార్వతీ పుత్రుడు కొలువుదీరడానికి సమయం ఆసన్నమవుతుండడంతో ప్రతిచోటా వినాయక ఉత్సవాల సందడి మొదలైంది. పలుచోట్ల ఇప్పటికే మండపాలకు పందిరాట వేయగా, మరికొంతమంది విగ్రహాలకు ఆర్డర్లు ఇవ్వడంతో పాటు కొనుగోలు చేస్తున్నారు. మండపాలను సుందరంగా తీర్చిదిద్దేందుకు పక్కా ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు. స్థానిక గిరి మార్కెట్ రోడ్, హనుమాన్ బజార్, బాపుర్ బజార్, పెద్ద బజార్, రామలింగం ట్యాంక్ రోడ్ వివిధ జంక్షన్లలో వినాయక విగ్రహాల అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. – బరంపురం



హనుమాన్ బజార్‌లో అమ్మకాలకు సిద్ధంగా ఉన్న గణపయ్య విగ్రహాలు



గేట్ బజార్ జంక్షన్‌లో భారీ విగ్రహాలు..



పెద్ద బజార్ జంక్షన్‌లో...



విగ్రహానికి తుది మెరుగులు దిద్దుతున్న కళాకారుడు

అంతోటి సమస్యకు.. ఇంతాటి పరిష్కారం

- పిడుగుపాటు మరణాలను తగ్గించడానికి తాటి చెట్ల పెంపకం: ఎస్‌ఆర్‌సీ
- పిడుగుపాటును 'ప్రకృతి విపత్తు'గా ప్రకటించాలి
- రాష్ట్రంలో 20 ఏళ్లలో 4 వేల మంది మృతి

భువనేశ్వర్: తుఫాన్లు, వాయుగుండాలతో నిత్యం అల్లాడే ఒడిశాకు పిడుగుపాట్లు తీవ్ర తలనొప్పులు తెచ్చి పెడుతున్నాయి. నానాటికీ పిడుగుపాటు మరణాలు పెరుగుతుండడంతో దీన్ని ప్రకృతి విపత్తుగా ప్రకటించాలని రాష్ట్ర ప్రభుత్వం దీర్ఘ కాలంగా కేంద్రంతో సంప్రదిస్తోంది. రాష్ట్రంలో పిడుగుపాటు



ఎస్‌ఆర్‌సీ అధ్యక్షతన అంతర్ విభాగ ఉన్నతాధికారుల సమావేశం

మృతుల సంఖ్య పెరగడంపై ప్రత్యేక సహాయ కమిషనర్ (ఎస్‌ఆర్‌సీ) సత్యబ్రత సాహు స్పందించారు. విపత్తు ఉపశమన నిధి కింద విపత్తులను తట్టుకునే ప్రాజెక్టులను చేపట్టేందుకు అంతర్ విభాగ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఎస్‌ఆర్‌సీ అధ్యక్షత వహించిన ఈ కీలక సమావేశంలో అటవీ శాఖ, వ్యవసాయ శాఖ ప్రతినిధులు పాల్గొన్నారు.

39, 392 పిడుగులు



ఈ నెల 2వ తేదీన రాష్ట్రంలో వేర్వేరు చోట్ల సమగ్రంగా 39,392 పిడుగులు పడ్డాయి. ఖుర్దా జిల్లాలో అత్యధికంగా 4,852, కటక్ ప్రాంతంలో 3,070, బౌధ్ జిల్లాలో 2,560, నయాగడ్ జిల్లాలో 2,454, బలంగీర్ ప్రాంతంలో 2,378 పిడుగుపాటు సంఘటనలు సంభవించినట్లు ఒడిశా రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ వర్గాలు తెలిపాయి.

పెరుగుతున్న పిడుగు పాటు మరణాలు

రాష్ట్రంలో తరచూ సంభవిస్తున్న పిడుగుపాటు మరణాలు కలవరపరుస్తున్నాయి. ఈ నెల 2వ తేదీన రాష్ట్రంలో పలు చోట్ల పిడుగులు పడి 12 మంది దుర్మరణం పాలయ్యారు. ఇంతకు ముందు 2021–22 సంవత్సరంలో గ్రామీణ ప్రాంతాల్లో 281 మంది ప్రాణాలను పిడుగులు బలికొన్నాయి. ఇలా గత 2 దశాబ్దాల్లో రాష్ట్రంలో పలు చోట్ల 4 వేల మంది పిడుగుపాటుకు గురై మృతి చెందారు. ఇటీవల సంభవించిన పిడుగుపాటు విపత్తుకు ఖుర్దా, పూరీ, కటక్, అంగుల్, ఢెంకనాల్, గజపతి, గంజాం, కంధమల్, జగత్‌సింగ్‌పూర్, బౌధ్, బొలంగీరు జిల్లాలు ప్రభావితమయ్యాయి.

తాటి చెట్ల పెంపకమే మార్గం



మెరుపులు, ఉరుములు, పిడుగుపాటు మృతుల నివారణపై అనుబంధ శాఖలు, విభాగాల ప్రతిపాదనల్ని పరిగణనలోకి తీసుకున్నారు. ఈ నేపథ్యంలో పిడుగుపాటు మరణాల నివారణకు తాటి చెట్ల పెంపకం ఉన్నత సోపానమని ప్రతిపాదించారు. ఈ ప్రతిపాదన కార్యాచరణకు ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా అభయారణ్య ప్రాంతాలు, పిడుగుపాటు మరణాలు సంభవిస్తున్న జిల్లాల్లో భారీగా తాటి చెట్ల పెంపకాన్ని చేపట్టాలని అటవీ శాఖ, వ్యవసాయ శాఖలకు ఆదేశించినట్లు ప్రత్యేక సహాయ కమిషనర్ తెలిపారు. విపత్తు ఉపశమన నిధుల్ని ఈ ప్రక్రియ కోసం వినియోగిస్తారు.

మరుగున పడిన ప్రతిపాదన

ప్రకృతి విపత్తుగా తాండవిస్తున్న పిడుగుపాటు మరణాల నివారణపై గతంలో చేసిన ప్రతిపాదనలు వాస్తవ కార్యాచరణకు నోచుకోలేదని పర్యావరణ వేత్త విశ్వజిత్ మహంతి ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర, జాతీయ రహదారుల వెంబడి, గ్రామాల సరిహద్దుల వెంబడి, రిజర్వ్ ఫారెస్టులు మరియు పొలాల వెంట తాటి చెట్ల పెంపకాన్ని ప్రోత్సహించడానికి 2018 సంవత్సరంలో అటవీ శాఖ రాష్ట్ర వ్యాప్తంగా ప్రాంతీయ చీఫ్ కన్జర్వేటర్స్ ఆఫ్ ఫారెస్ట్, డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్‌లకు మార్గదర్శకాలు జారీ చేసింది. ఈ చొరవ ఆశించిన ఫలితాలను ఇవ్వలేదు. ఈ విషయమై ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ (వన్యప్రాణులు)తో పర్యావరణవేత్త విశ్వజిత్ మహంతి ఉత్తరప్రత్యుత్తరాలు జరిపారు. ఆయన జారీ చేసిన సమాచారం ప్రకారం.. కెంజొహర్ జిల్లా తెల్కోయ్ రేంజ్, ఢెంకనాల్, అంగుల్ ఫారెస్ట్ డివిజన్‌లలో పెద్ద ఎత్తున తాటి చెట్లను నరికివేసినట్లు తేటతెల్లమైంది. పట్టణీకరణ, మౌలిక సదుపాయాల అభివృద్ధి నేపథ్యంలో తాటి చెట్ల పెంపకం ఫామ్ హౌస్‌ల కంచె కట్టుగా పరిమితమైంది. గ్రామీణ ప్రాంతాల్లో ఈ చెట్ల పెంపకం మరుగున పడింది. తాటి చెట్లు మెరుపు దాడులను నిరోధించడమే కాకుండా తీర ప్రాంతాలను తుఫాన్లు, వరదల వంటి విపత్తుల నుంచి రక్షణ కల్పిస్తాయి. ఈ చెట్ల వేర్లు నేల కోతకు వ్యతిరేకంగా వరద–రక్షణ కట్టలను పటిష్టంగా పరిరక్షించేందుకు దోహదపడతాయి. తాటి చెట్ల ఫల సాయం కోసం 3 నుంచి 4 ఏళ్ల వరకు వేచి ఉండాల్సిన పరిస్థితులతో వీటి పెంపకంపై పలువురు అనాసక్తి ప్రదర్శిస్తున్నట్లు మాజీ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ (పీసీసీఎఫ్) బిజయ్ కేతన్ పట్నాయక్ తెలిపారు.

ప్రకృతి విపత్తుగా ప్రకటించాలి

గత 20 ఏళ్లలో రాష్ట్రంలో సమగ్రంగా 4,000 మంది పిడుగుపాటుకు ప్రాణాలు కోల్పోయారు. ఈ ప్రమాదాన్ని ప్రకృతి విపత్తుగా ప్రకటించాలని కేంద్ర ప్రభుత్వానికి అభ్యర్థించినట్లు రాష్ట్ర విపత్తు నిర్వహణ–రెవెన్యూ విభాగం మంత్రి ప్రమీలా మల్లిక్ తెలిపారు. పిడుగుపాటుకు గురైన మృతుల కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం రూ. 4 లక్షల ఎక్స్‌గ్రేషియా అందజేస్తోంది. పిడుగుపాటును ప్రకృతి వైపరీత్యాల జాబితాలో చేర్చితే, మృతుల కుటుంబానికి ప్రస్తుత నిబంధనల ప్రకారం మరింత మెరుగైన పరిహారం లభిస్తుందని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. జాతీయ స్థాయిలో క్లౌడ్–టు గ్రౌండ్ మెరుపు దాడుల జాబితాలో రాష్ట్రం మూడో స్థానంలో కొనసాగుతున్నట్లు ఇటీవల జారీ అయిన క్లైమేట్ రెసిలెంట్ అబ్జర్వింగ్ సిస్టమ్ ప్రమోషన్ కౌన్సిల్ వార్షిక థండర్ స్టార్మ్ రిపోర్ట్ 2022–23 పేర్కొంది. ఈ నివేదిక ప్రకారం తొలి 2 స్థానాల్లో మధ్యప్రదేశ్, మహారాష్ట్ర ఉన్నాయి.

జీ-20 సదస్సులో కోణార్క్ చక్రం తళుకులు



కోణార్కు చక్రం వేదికగా జీ20 దేశాధినేతలకు కరచాలనంతో స్వాగతం పలుకుతున్న భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ

భువనేశ్వర్: జీ20 దేశాధినేతల శిఖరాగ్ర వేదిక ప్రాంగణంలో కోణార్క్ చక్రం కరచాలన వేదికగా అంతర్జాతీయ ప్రముఖుల్ని విశేషంగా ఆకట్టుకుంటోంది. ఈ సమావేశానికి ప్రపంచ దేశాల నుంచి విచ్చేసిన అధినేతలకు భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఈ ప్రాంగణంలోనే కరచాలనంతో స్వాగతం పలికారు. కోణార్క్ ఆలయం 13వ శతాబ్దంలో రాజు నరసింహదేవ – 1 పాలనలో నిర్మించారు. 1984లో యునెస్కో దీన్ని వారసత్వ ప్రదేశంగా ప్రకటించింది. ఈ చక్రంలో 24 చువ్వలు రోజులో 24 గంటలకు ప్రతీక. నిరంతర కాల గమనానికి నిదర్శనం. భారతదేశపు ప్రాచీన జ్ఞానం, అధునాతన నాగరికత, నిర్మాణ నైపుణ్యాన్ని ప్రతిబింబిస్తుంది.

హక్కుల సాధనకు ఆందోళన



ఆందోళన చేపడుతున్న ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు

జయపురం: తమ న్యాయపరమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ అఖిల ఉత్కళ ప్రాథమిక శిక్షక ఫెడరేషన్ ఇచ్చిన పిలుపుతో జయపురం సమితిలోని ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు బ్లాక్ ఎడ్యుకేషన్ కార్యాలయం ముందు శుక్రవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఉత్కళ ప్రాథమిక శిక్షక ఫెడరేషన్ జయపురం సమితి శాఖ అధ్యక్షుడు దేవీ ప్రసాద్‌దాస్ మాట్లాడుతూ గతేడాది నవంబర్ నెలలో విధాన సభ ముందు నాలుగు రోజులు ఆందోళన చేశామని వెల్లడించారు. తమ సమస్యలపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అధ్యక్షతన ఒక ఉన్నత స్థాయి కమిటీ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. డిమాండ్లు నెరవేర్చుతామని అప్పట్లో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి లిఖిత పూర్వకంగా హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అయితే హామీ ఇచ్చి 8 నెలలు గడిచినా తమ డిమాండ్లు పరిష్కారం అవ్వలేదని ఆరోపించారు. ఇటీవల ఆగస్టు 5వ తేదీన బ్లాక్ ఎడ్యుకేషన్ అధికారి ద్వారా, 11వ తేదీన జిల్లా విద్యాధికారి, జిల్లా కలెక్టర్ల ద్వారా సమితి సంఘం, జిల్లా సంఘాలు ప్రభుత్వానికి వినతులు పంపినా పట్టించుకోలేదన్నారు. అందుచేత రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపట్టినట్లు వెల్లడించారు. నిరసనలో ఫెడరేషన్ కార్యదర్శి మహేశ్వర మిశ్ర, సురేంద్ర నాథ్ దాస్, లక్ష్మీకాంత పాఢీ, మనోరంజన్ బిశాయి తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌కు అనూహ్య స్పందన



జిల్లా జడ్జి కోర్టులో లోక్‌అదాలత్ లో పాల్గొన్న జిల్లా లీగల్ సర్వీసెస్ ప్రాధికరణ కార్యదర్శి రబినారాయణ బెహరా తదితరులు



లోక్‌అదాలత్‌లో జిల్లా జడ్జి ప్రణబ్ కుమార్ రౌత్రాయ్

పర్లాకిమిడి: రాష్ట్ర వ్యాప్తంగా శనివారం నిర్వహించిన లోక్‌అదాలత్‌కు అనూహ్య స్పందన లభించింది. అధిక సంఖ్యలో కేసులు పరిష్కారమయ్యాయి.

✔ పర్లాకిమిడి జిల్లా కోర్టులో శనివారం నిర్వహించిన రాష్ట్రీయ లోక్ అదాలత్‌ను జిల్లా జడ్జి ప్రణబ్ కుమార్ రౌత్రాయ్ ప్రారంభించారు. జిల్లా న్యాయ సలహా ప్రాధికరణ కార్యదర్శి రబినారాయణ బెహరా జిల్లా లోక్ అదాలత్‌ను పర్యవేక్షించారు.

✔ మోహనా కోర్టులో ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ సుభజిత్ బెహరా, ఆర్.ఉదయగిరి కోర్టులో సబ్ జడ్జి పుణ్యస్లోకో రోథో, కాశీనగర్ కోర్టులో ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ అంకితా గురు, పర్లాకిమిడి జిల్లా ఫ్యామిలీ కోర్టులో జడ్జి సుబ్రత్ మహంతి, అదనపు జిల్లా జడ్జి ప్రదీప్ కుమార్ సామల్, ముఖ్యవిచారణ అధికారి నరోత్తమ శెఠి, కోర్టు రిజిస్ట్రార్ సత్యబ్రత రోణాలు పాల్గొన్నారు.

✔ జిల్లాలో మొత్తం 760 కేసులకు 103 కేసులు పరిష్కరించారు. రూ.9లక్షల రెండు వేల యాభై తొమ్మిది రూపాయలు జరిమానా వసూలు చేశారు.

✔ జిల్లాలో వివిధ బ్యాంకుల్లో 618 డిఫాల్ట్ కేసులు పెండింగ్‌లో వుండగా వాటిలో 59 కేసులు పరిష్కారమయ్యాయి. బ్యాంకులకు జరిమానా రూపంలో రూ.5,26,059లు వసూలు చేశారు.

కొరాపుట్ జిల్లాలో 258 కేసులు పరిష్కారం

జయపురం: కొరాపుట్ జిల్లా కోర్టులలో శనివారం నిర్వహించిన రాష్ట్రీయ లోక్‌అదాలత్‌లో 258 కేసులు పరిష్కరించినట్లు అధికారులు వెల్లడించారు. జిల్లా జడ్జి సత్యనారాయణ మిశ్ర జయపురం పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమం జరిగింది. జయపురం, కొరాపుట్, బొరిగుమ్మ, కొట్‌పాడ్, లక్ష్మీపూర్, దసమంతపూర్, సిమిలిగుడ, అమతాపుట్ కోర్టులలో రాష్ట్రీయ లోక్ అదాలత్‌లు నిర్వహించారు. జయపురం జిల్లా కోర్టులో నిర్వహించిన లోక్‌అదాలత్‌లో జిల్లా జడ్జి సత్యనారాయణ మిశ్ర, ఫ్యామిలీ కోర్టు జడ్జి పవిత్ర మోహన ప్రధాన్, కార్మిక కోర్టు జడ్జి బిద్యాధర పుష్టి, మహిళా కోర్టు జడ్జి జయపురం శ్రీమతి రేఖారాణి పండ, లోక్ అదాలత్ శాశ్వత జడ్జి, జిల్లా న్యాయ సేవా ప్రదీకరణ కార్యదర్శి సుమన్ జేన, జయపురం సబ్‌డివిజన్ జడ్జి సంతోష్ కుమార్ బారిక్, జయపురం ప్రథమ శ్రేణి జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఆదర్శ కుమార్ బెహరాలు పాల్గొని కేసులను పరిష్కరించారు.

→ ఈ అదాలత్‌లో 17 కేసులు పరిష్కరించి బాధితులకు రూ.1.21 కోట్లు పరిహారంగా ఇప్పించారు.

→ 14 కేసుల్లో బ్యాంక్ ఋణగ్రస్తుల నుండి రూ.10.52 లక్షలు వసూలు చేశారు.

→ 48 ఎస్.ఐ. కేసులు పరిష్కరించి రూ.2.64 కోట్ల వసూలు చేశారు.

→ 18 వివాహ పరమైన కేసులు, 19 క్రిమినల్ కేసులు, 140 సివిల్ కేసులు, పాత కేసులకు సంబంధించి 88 బ్యాంక్ అప్పుల కేసులు, 9 లేబర్ కేసులు, ఋణాలకు సంబంధించి 14 కేసులు, 11 ఈ చలానా కేసులు పరిష్కరించినట్లు వెల్లడించారు.



జిల్లా ఫ్యామిలీ కోర్టులో విచారణ అధికారి విష్ణుప్రియా సామంత్రే, ప్రాధికరణ కార్యదర్శి రబినారాయణ బెహరా



కేసులు పరిష్కరిస్తున్న జిల్లా జడ్జి తదితరులు



మూడు కుటుంబాలను కలిపి వారిని ఆశీర్వదిస్తున్న జిల్లా జడ్జి

క్లుప్తంగా

'జీతాలు చెల్లించాలి'

శ్రీకాకుళం న్యూకాలనీ: బదిలీ అయిన టీచర్ల జీతాలు వెంటనే చెల్లించాలని పీఆర్‌టీయూ రాష్ట్ర గౌరవాధ్యక్షులు బైరి అప్పారావు అన్నారు. శ్రీకాకుళంలోని పీఆర్‌టీయూ జిల్లాశాఖ కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జీతాల చెల్లింపులు ఇంకా జాప్యమైతే రాష్ట్రవ్యాప్తంగా అన్ని ట్రెజరీ కార్యాలయాల ముందు ధర్నా చేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు.

16,17 తేదీల్లో క్యాంపస్ ఇంటర్వ్యూలు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా కేంద్రంలోని శ్రీనివాసనగర్ కాలనీలో ఉన్న ఆదిత్య డిగ్రీ, పీజీ కాలేజ్ వేదికగా ఈ నెల 16, 17 తేదీల్లో ప్రముఖ ఫార్మాకంపెనీల్లో వివిధ ఉద్యోగాల భర్తీ కోసం క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్టు ఆ కళాశాల ప్రిన్సిపాల్ టి.విజయకుమార్ నాయుడు, వైస్ ప్రిన్సిపాల్ డి.శైలజ తెలిపారు. ఫార్మా రంగంలో పనిచేయాలనే ఆసక్తి ఉన్న యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. పూణెలో ఉన్న హానర్ ఫార్మా కంపెనీలో ప్రొడక్షన్, క్వాలిటీ కంట్రోల్, క్వాలిటీ ఎస్యూరెన్స్, స్టోర్స్, సేఫ్టీ, పర్చేజ్ విభాగాల్లో ఉద్యోగాల కోసం క్యాంపస్ ఇంటర్వ్యూలు జరుపుతున్నట్టు చెప్పారు. 2018 నుంచి 2023 సంవత్సరంలో బీటెక్ మెకానికల్, బీఫార్మసీ, ఎం.ఫార్మసీ, బీఎస్సీ కెమిస్ట్రీ, బీఎస్సి కంప్యూటర్ సైన్స్, ఎంఎస్సీ ఆర్గానిక్, ఎనలిటికల్ కెమిస్ట్రీ, పాలిటెక్నిక్, బీఏ, బీకాం, ఐటీఐల్లో ఉత్తీర్ణులైన పురుష విద్యార్థులు ఈ జాబ్‌మేళాలో పాల్గొనేందుకు అర్హులని పేర్కొన్నారు. ఎంపికైన వారికి జీతం ఏడాదికి రూ.2.4లక్షల నుంచి రూ.2.9లక్షల వరకు ఉంటుందని, దీంతోపాటు ఉచిత వసతి, భోజన, రవాణా సౌకర్యాలను కంపెనీ కల్పిస్తుందన్నారు. ఎంపికైనవారు కంపెనీకి ఎలాంటి ఒరిజనల్ సర్టిఫికెట్లు గానీ, డిపాజిట్ గానీ ఇవ్వాల్సిన అవసరం లేదని కంపెనీ ప్రతినిధులు స్పష్టం చేసినట్టు వారు చెప్పారు. ఆసక్తి కలిగి అర్హత ఉన్న అభ్యర్థులు 7337041426 (ఎ.నరేష్) నంబర్‌కి ఈనెల 14వ తేదీ సాయంత్రం 5గంటల్లోగా రూ.100 ఫోన్‌పే చేసి ముందుగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. ఆసక్తి, అర్హత కలిగిన నిరుద్యోగ పురుష అభ్యర్థులు వివరాలు కోసం టి.విజయ కుమార్(9392255211), డి.శైలజ (90301 94567), ప్లేస్‌మెంట్ ఆఫీసర్ ఎస్.శ్రీనివాసరావు (9966255963), ఎ.నరేష్ (7337041426)లను సంప్రదించాలన్నారు.

వాహనం ఢీ కొని మహిళ మృతి



గుర్తు తెలియని వాహనం ఢీ కొని మృతి చెందిన సప్ప చిన్నమ్మి

నందిగాం: మండల పరిధిలోని సుభద్రాపురం జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీ కొని అదే గ్రామానికి చెందిన సప్ప చిన్నమ్మి(63)అనే మహిళ మృతి చెందారు. నందిగాం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చిన్నమ్మి శనివారం ఉదయం 5 గంటలకు స్నానం చేసేందుకు బావికి వెళ్లేందుకు జాతీయ రహదారి దాటుతుండగా టెక్క లి నుంచి పలాస వైపు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో అక్కడికక్కడే మృతి చెందారు. చిన్నమ్మి భర్త అప్పయ్య ఫిర్యాదు మేరకు నందిగాం ఎస్ఐ మహమ్మద్ అమీర్ ఆలీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆస్పత్రిలో చోరీకి విఫలయత్నం

టెక్కలి రూరల్: స్థానిక జిల్లా కేంద్రాస్పత్రి ఇన్‌పేషంట్ వార్డులో శుక్రవారం అర్ధరాత్రి దాటాక ఓ వ్యక్తి చోరీ చేయడానికి విఫల యత్నం చేశాడు. ఆస్పత్రి సిబ్బంది, రోగులు తెలిపిన వివరాల మేరకు.. ఆస్పత్రిలోని ఎంఎస్, ఎంఎంబీడీ వార్డుల్లో అర్ధరాత్రి తర్వాత ఓ వ్యక్తి ప్రవేశించి పలువురు మహిళల మెడలో బంగారు గొలుసులు, కాళ్ల పట్టీలు తీసేందుకు ప్రయత్నించాడు. రోగులు కేకలు వేయడంతో పరారైపోయాడు. దీనిపై టెక్కలి ఎస్ఐ రామకృష్ణకు ఆస్పత్రి సిబ్బంది ఫిర్యాదు చేశారు.

జిల్లాపై నిఘానేత్రం

శ్రీకాకుళం క్రైమ్ : నేర నియంత్రణలో నిఘా పాత్ర ఎంతో కీలకమని పోలీసు యంత్రాంగం భావిస్తోంది. దీనిలో భాగంగానే ఈ 2023లో 1416 సీసీ కెమెరాలు (పీటీజెడ్ -58, బుల్లెట్ -136, జనరల్ -1222) ఇప్పటివరకు మూడు సబ్ డివిజన్ల (శ్రీకాకుళం -754, టెక్కలి -376, కాశీబుగ్గ -286) పరిధిలో ఏర్పాటుచేశారు. మరిన్ని పెంచే యోచనలో ఉన్నారు. శ్రీకాకుళం సబ్‌డివిజన్‌లోని శ్రీకాకుళం వన్‌టౌన్‌లో 110, టూటౌన్ 129, రూరల్ 108, గార 69, ఆమదాలవలస 43, సరుబుజ్జిలి 32, బూర్జ 12, పొందూరు 94, జె.ఆర్.పురం 4, ఎచ్చెర్ల 42, లావేరు 73, జి.సిగడాంలో 38 కెమెరాలు అమర్చారు. టెక్కలి సబ్ డివిజన్‌లో టెక్కలిలో 30, కోటబొమ్మాళి 48, సంతబొమ్మాళి 14, నౌపడ 14, నందిగాం 50, నరసన్నపేట 71, జలుమూరు 26, పోలాకి 10, సారవకోట 39, పాతపట్నం 12, మెళియాపుట్టి 08, కొత్తూరు 50, హిరమండలం 04 సీసీ కెమెరాలు అమర్చారు. కాశీబుగ్గ సబ్‌డివిజన్‌లో కాశీబుగ్గలో 32, మందస 25, వజ్రపుకొత్తూరు 45, సోంపేట 40, బారువ 24, కంచిలి 34, ఇచ్ఛాపురం టౌన్ 07, ఇచ్ఛాపురం రూరల్ 58, కవిటిలో 21 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు.

నందన్‌కానన్‌కు కొత్త అతిథులు



బారంగ్ నందన్‌కానన్‌కు చేరిన కొత్త అతిథులు

భువనేశ్వర్: మిజోరాంలోని ఐజ్వాల్ జూ నుంచి నందన్‌కానన్ జూలాజికల్ పార్క్ (ఎన్‌జెడ్‌పీ)కి ఐదు కొత్త జంతువులు వచ్చాయి. జంతు మార్పిడి కార్యక్రమం కింద తీసుకు వచ్చిన కొత్త అతిథుల్లో ఒక జత హూలాక్ గిబ్బన్‌లు, ఒక జత పిగ్-టెయిల్డ్ మకాక్, ఆడ హిమాలయన్ నల్ల ఎలుగుబంటి ఉన్నాయి. వీటిలో పిగ్ టెయిల్డ్ మకాక్ అనేది కొత్త జాతి. దీంతో నందన్‌కానన్ జంతు ప్రదర్శనశాలలో 163 విభిన్న జాతుల జంతువులు ఉన్నాయి. సెంట్రల్ జూ అథారిటీ (సీజెడ్ఏ) ఆమోదం ప్రకారం జంతు మార్పిడి కార్యక్రమం కింద మిజోరాంలోని ఐజ్వాల్ జూలాజికల్ పార్క్ నుంచి జంతువులను నందన్‌కానన్ జూకు తీసుకువచ్చారు. ఈ ఏడాది మార్చిలో నందన్‌కానన్ జూ రెండు పులులను ఐజ్వాల్‌కు పంపింది. వీటికి బదులుగా కొత్త అతిథుల్ని తరలించారు. కొత్త జీవాలు దాదాపు ఒక నెల రోజుల పాటు నిర్బంధంలో ఉంటాయి. ఆ తర్వాత సందర్శకులకు ప్రదర్శనకు ఏర్పాటు చేస్తారని జూ అధికారులు తెలిపారు. ఏసీఎఫ్ సుదీప్ కుమార్ పండా, పశువైద్యుడు టి.విక్రమ్ ఆధ్వర్యంలో ఆరుగురు సభ్యుల బృందం శుక్రవారం రాత్రి ఈ జంతువుల్ని సురక్షితంగా నందన్‌కానన్ జూకు చేర్చింది.

వన్ భోజీ.. వహ్వాజీ

- రత్న వేదికపై జగన్నాథుని వన్ భోజీ అలంకరణ
- కృష్ణ బలరాముల రూపంలో దర్శనం



శ్రీ జగన్నాథ, బలభద్ర స్వాముల వన్ భోజీ అలంకరణ

భువనేశ్వర్: పూరీ శ్రీ జగన్నాథుని ఆలయం రత్న వేదికపై శ్రీ జగన్నాథుడు వన్ భోజీ అలంకరణతో అలరించారు. శ్రీకృష్ణ జన్మాష్టమి నుంచి ప్రారంభమైన శ్రీ కృష్ణ లీలా మహోత్సవాల్లో భాగంగా దశమి తిథి పురస్కరించుకుని శుక్రవారం ఈ అలంకరణ చేయడం ఆచారం. కృష్ణబలరాములు ఆవు దూడలతో వన భోజనాలకు వెళ్లినట్లు పౌరాణిక కథనం. ఈ సంప్రదాయాన్ని స్మరిస్తూ, భాద్రపద కృష్ణ పక్ష దశమి నాడు శ్రీ జగన్నాథుడిని ప్రత్యేక అలంకరణలో పూజిస్తారు. ఈ సందర్భంగా మధ్యాహ్న ధూపదీపానంతరం శ్రీ జగన్నాథుడు, బలభద్రుని నుంచి ఆజ్ఞా మాలలు తెచ్చి దక్షిణ ద్వారం వద్ద ఉన్న రామకృష్ణులకు సమర్పించి రామకృష్ణుల మూర్తులను పల్లకిలో బొడొ ఛొత్తా మఠం ఆవరణలో రేగు పండ్లు అమ్మకం నిర్వహించారు. అనంతరం సంధ్యా ధూపం తర్వాత వన్ భోజీ అలంకరణలో అఘాసుర, బకాసుర వధ సేవలు నిర్వహించారు. స్వామిని వివిధ రకాల బంగారు ఆభరణాలతో శిరస్సున జీలుగు, బెత్తంతో తయారు చేసిన పలు ఆకర్షణీయ పుష్పాలతో అలంకరించారు. నేడు కాళీయదళన అలంకరణ భాద్రపద కృష్ణ పక్ష ఏకాదశి తిథి పురస్కరించుకుని రత్న వేదికపై కాళీయదళన అలంకరణ చేస్తారు. ద్వాదశి నాడు ప్రలాంబసుర వధ, త్రయోదశి తిథి నాడు కృష్ణ బలరాముల అలంకరణలో శ్రీ మందిరం రత్న వేదికపై జగన్నాథుడు, బలభద్ర స్వామి ప్రత్యేక శోభతో భక్తులకు దర్శనం ఇస్తారు. ఈ దర్శనం పునర్జన్మ నివారిస్తుందని నమ్ముతారు.

ప్రథమ చికిత్సతో ప్రాణాలు కాపాడవచ్చు



మాట్లాడుతున్న యజ్ఞేశ్వర పండ



ప్రథమ చికిత్సపై విద్యార్థికి అవగాహన కల్పిస్తున్న దృశ్యం

జయపురం: ప్రమాదాలు జరిగినప్పుడు ప్రథమ చికిత్స అందజేయడం వలన ప్రాణాలు కాపాడవచ్చని కొరాపుట్ జూనియర్ రెడ్‌క్రాస్ అధికారి, రక్షక సాధన వర్కర్ యజ్ఞేశ్వర పండ అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జూనియర్ రెడ్‌క్రాస్ శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ ప్రాథమిక చికిత్స దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రమాదాల్లో రక్తం బాగా పోయినప్పుడు, ఎముకలు విరిగిన సమయంలో, ఊపిరి ఆడని పరిస్థితిలో, కుక్కలు కాటు వేసిన సమయంలో, పాము కాటు వేసేటప్పుడు ఏవిధంగా ప్రథమ చికిత్స చేయాలో వివరించారు. పాఠశాల జూనియర్ రెడ్‌క్రాస్ కో-ఆర్డినేటర్ శుభస్మిత సాహు ప్రాథమిక చికిత్స దినోత్సవం ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు ప్రకాశ చంద్ర పట్నాయిక్, విశ్వరంజన్ గౌడ, దేవేంద్ర కుమార్ పాఢీ, సోమనాథ్ సాకియ, సువర్ణ ఖిలో తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి బలవన్మరణం



చెట్టుకు వేలాడుతున్న బామ్ రంజాన్ టిక్‌ధర్ మృతదేహం

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా కలిమెల సమితి వేంకటపలెం పంచాయతీ ఎంవీ-74 గ్రామానికి చెందిన బాబ్ రంజాన్ టిక్‌ధర్ (52) బలవన్మరణానికి పాల్పడ్డాడు. గ్రామశివార్లో చెట్టుకు వేలాడుతూ శనివారం ఉదయం కనిపించినట్టు పోలీసులు తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం మద్యం తాగి ఇంటికి వచ్చిన బాబ్ రంజాన్ టిక్‌ధర్ కొద్దిసేపటి తరువాత పని ఉందని చెప్పి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. తిరిగి సాయంత్రం ఆరు గంటలకు ఇంటికి వచ్చి పని కోసం ఆంధ్రప్రదేశ్‌లోని ఓ గ్రామానికి వెళ్తున్నానని తమ్ముడు నిమయున్ టిక్‌ధర్, పెద్ద కొడుకు భుషన్ టిక్‌ధర్‌కు చెప్పేసి వెళ్లిపోయాడు. శనివారం గ్రామ శివార్లోకి వెళ్లిన స్థానికులకు బాబ్ రంజాన్ టిక్‌ధర్ ఓ చెట్టుకు వేలాడుతూ శవమై కనిపించడంతో కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి చూసిన తరువాత పోలీసులు సమాచారం చేరవేశారు. పోలీసులు పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కలిమెల ఆరోగ్య కేంద్రానికి తరలించారు. దీనిపై దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

గంజాయి స్వాధీనం



ఎక్సైజ్ పోలీసులకు చిక్కిన ఉమేష్ యాదవ్



స్వాధీనం చేసుకున్న గంజాయి

రాయగడ: గంజాయిని అక్రమంగా తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్టు అబ్కారీ శాఖ అధికారులు తెలిపారు. స్థానిక రైల్వే స్టేషన్ ప్రాంతంలో శనివారం తనిఖీలు చేస్తుండగా అనుమానాస్పదంగా తిరుగుతున్న ఉత్తరప్రదేశ్‌లోని బలిమా జిల్లా శతాబ్దియా గ్రామానికి చెందిన ఉమేష్ యాదవ్‌ను తనిఖీ చేసి 2.350 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని ఎక్సైజ్‌శాఖ డిప్యూటీ సూపరింటెండెంట్ గుప్తేశ్వర్ ప్రధాన్ తెలిపారు. రాయగడలో ఓ వ్యక్తి గంజాయిని మధ్యప్రదేశ్‌లోని రాయిపూర్‌కు తరలిస్తే రూ. ఐదు వేలు ఇస్తానని చెప్పడంతో యాదవ్ ఈ అక్రమ రవాణాకు పాల్పడినట్లు దర్యాప్తులో తేలినట్టు గుప్తేశ్వర్ ప్రధాన్ చెప్పారు. తనిఖీల్లో ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ సీమా కిరణ్ బెక్, హెచ్‌సీ సంజయ్ కుమార్ ప్రధాన్, రాసి నాయక్, సంగ్రాం ప్రధాన్ ఉన్నారు.

నర్సరీలతో మహిళలకు ఉపాధి



నర్సరీపై శిక్షణ ఇస్తున్న అటవీ శాఖ రేంజ్ అధికారులు

పర్లాకిమిడి: నర్సరీలతో మహిళలకు ఉపాధి లభిస్తుందని అధికారులు అన్నారు. స్థానిక డీఎఫ్‌వో కార్యాలయంలో అటవీ శాఖ ఆధ్వర్యంలో పర్లాకిమిడి అటవీ శాఖ రేంజ్ పరిధిలోని మోహనా, చంద్రగిరి, రామగిరి, ఆర్.ఉదయగిరి, మహేంద్ర, దేవగిరి మరియు కాశీనగర్ ప్రాంతంలోని మహిళా స్వయం సహాయక గ్రూపులకు నర్సరీలపై శిక్షణ శిబిరం శనివారం నిర్వహించారు. అటవీ సంరక్షణ అధికారి అశోక్ కుమార్ బెహరా, అరుణ్ కుమార్ సాహులు శిక్షణ అందించారు. సెప్టెంబర్ మొదటి వారంలోనే మొక్కల నర్సరీ ఏర్పాటు చేసి మహిళలకు అందిస్తామని డీఎఫ్‌వో ఆనంద్ తెలిపారు.



సమావేశానికి హాజరైన మహిళలు

అభివృద్ధి పథకాలపై చర్చ



ఆకాంక్ష కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్



బ్లాక్ స్థాయి అధికారులు, మహిళా గ్రూపులతో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ సీడీఎం గుణనిధి నాయక్

పర్లాకిమిడి: గజపతి జిల్లాలోని గుమ్మా, ఆర్.ఉదయగిరి సమితుల్లో జరుగుతున్న వివిధ అభివృద్ధి పథకాల ప్రగతిపై అధికారులు శనివారం చర్చించారు. జిల్లా పరిషత్ కాన్ఫరెన్సు హాలులో జిల్లా కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్ సమావేశంలో పాల్గొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ వెనుకబడిన జిల్లాలకు కేటాయించిన నిధులు ఏవిధంగా గిరిజనులకు ఉపయోగపడనున్నాయో వాటిని ఆకాంక్ష పేరుతో వివిధ పథకాలు అమలు చేసేందుకు ఆయా బ్లాక్ డెవలప్‌మెంట్ అధికారులతో చర్చించారు. గుమ్మా, ఆర్.ఉదయగిరి సమితి కేంద్రాల్లో మహిళా గ్రూపులు, పంచాయతీ ప్రతినిధులు వివిధ అభివృద్ధి పథకాలను పర్యవేక్షిస్తారు. కార్యక్రమంలో సమితి స్థాయి అధికారులు, పిరమళ్ ఫౌండేషన్ తరపున శుభం సింగ్, అలోక్ ద్వివేదిన, పిరమళ్ ఫౌండేషన్ ప్రతినిధి వెంకట్, మహేశ్వర్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా జిల్లా ఫెన్సింగ్ ఎంపిక పోటీలు



ఎంపికైన క్రీడాకారులతో అతిథులు, కోచ్‌లు, ఫెన్సింగ్ సంఘ ప్రతినిధులు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా స్థాయి అండర్-10,12 బాలబాలికల ఫెన్సింగ్ ఎంపిక పోటీలు శనివారం ఉత్సాహంగా సాగాయి. శ్రీకాకుళం జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలోని టౌన్ హాల్ వేదికగా నిర్వహించిన ఈ పోటీలను వ్యాపారవేత్త బలభద్రుని రాజా, జర్నలిస్ట్ ఎం.సుధీర్ వర్మలు ప్రారంభించారు. జిల్లాలో ఫెన్సింగ్ క్రీడకు రోజురోజుకి ఆదరణ పెరుగుతుండటం అభినందనీయమన్నారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన క్రీడా కారులు ఫెన్సింగ్ ఎంపిక పోటీల్లో తమ ప్రతిభను నిరూపించుకున్నారు. ఇక్కడ ఎంపికచేసిన జిల్లా క్రీడాకారులు ఈ నెల 12వ తేదీన కాకినాడ వేదికగా జరిగే రాష్ట్రస్థాయి అండర్-10, 12 చాంపియన్‌షిప్ పోటీల్లో ప్రాతినిధ్యం వహిస్తారని చెప్పారు. అనంతరం ఎంపికైన క్రీడాకారులను అభినందించారు. ఎన్ఐఎస్ కోచ్ జోగిపాటి వంశీ న్యాయనిర్ణేతగా వ్యవహరించిన ఈ పోటీలలో ఫెన్సింగ్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తైక్వాండో శ్రీను, జిల్లా అధ్యక్షుడు వైశ్యరాజు మోహన్, గురుగుబెల్లి ప్రసాద్, సంపతిరావు నాయుడు, పీడీ డి.భవానీ, పీఈటీ రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

కైలాస్ రథం వితరణ



కైలాస్ రథం తాళాన్ని అందజేస్తున్న కిశోర్‌చౌదరి



కైలాస్ రథం


మల్కన్‌గిరి: జయపురానికి చెందిన వ్యాపార సంఘ అధ్యక్షుడు కిశోర్ చౌదరి తన తండ్రి జ్ఞాపకార్థం మల్కన్‌గిరిలోని వ్యాపార సంఘానికి కై లాస్ రథాన్ని వితరణగా శనివారం అందజేశారు. స్థానిక టౌన్‌హాల్ వద్ద జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ఎవరైనా చనిపోతే శ్మశానవాటికకు మృతదేహాన్ని తీసుకెళ్లేందుకు ఇబ్బందులు పడేవారన్నారు. దీంతో తమశనాడు నుంచి కైలాస్ రథాన్ని కొనుగోలు చేసి స్థానికుల అవసరాల కోసం సమకూర్చినట్టు చెప్పారు. కిశోర్ చౌదరి తల్లి, మల్కన్‌గిరి రోటరీ క్లబ్ అధ్యక్షుడు శ్యామ్‌బాబుదొర, సురేష్ సోమానీ పాల్గొన్నారు.

కంటికిరెప్పలా..

- ముఖ్యమంత్రి ఈ-ఐ కేంద్రాలకు పెరుగుతున్న ఓపీ
- జిల్లాలోని ఆరు సామాజిక ఆస్పత్రుల్లో సేవలు
- కంటి పరీక్షలు, ఆపరేషన్‌లు, కళ్లద్దాల పంపిణీ సక్సెస్



పలాస ముఖ్యమంత్రి ఈ-ఐ కేంద్రంలో ఆధునిక యంత్రాలతో పరీక్షలు



కంటి సమస్యలను చూపించే ప్రాజెక్టర్‌లు

కాశీబుగ్గ: జిల్లాలో అధునాతన పద్ధతిలో ప్రభుత్వం చేపడుతున్న ఉచిత నేత్ర పరీక్షలు విజయవంతంగా కొనసాగుతున్నాయి. జిల్లాలోని ఆరు ప్రభుత్వ సామాజిక ఆస్పత్రుల్లో ఉన్న ముఖ్యమంత్రి ఈ-ఐ కేంద్రాల్లో పరీక్షలు ప్రత్యేకమైన ఆధునిక యంత్రాలతో చేపడుతున్నారు. 60 ఏళ్లలోపు వారందరికీ ఉచితంగా శుక్లాలు, దృష్టి లోపం వంటి వివిధ కంటి వ్యాధులకు సంబంధించి వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. చక్కెర వ్యాధిగ్రస్తులకు అతి ఖరీదైన ఫండస్ రెటినో పరిక్షలను నిర్వహించి ఫలితాలను ఆయా ముఖ్యమంత్రి ఈ-ఐకేంద్రాల్లో తెలియజేస్తున్నారు.

అత్యాధునిక మిషనరీలతో పరీక్షలు

ప్రభుత్వ ఆస్పత్రిలో కేవలం ఆధార్ నంబర్ ఆధారంగా నమోదు ప్రక్రియను చేపడుతున్నారు. వారి ఐడీని క్రియేట్ చేసి కంటి సమస్యతో బాధపడుతున్న వారికి ఉచితంగా పరీక్షలు చేపడుతున్నారు. సుమారు ఒక్కోటి రూ.8 లక్షలకుపైగా విలువైన రెండు మిషనరీలు ప్రతి కేంద్రంలో అందుబాటులోకి తీసుకువచ్చారు. ముఖ్యంగా ఆటో రిఫ్లక్షన్ మిషన్, రెటీనా పరీక్షల మిషన్‌తో పరీక్షలు ఉచితంగా అందిస్తున్నారు. ప్రైవేటు ఆస్పత్రుల్లో ఈ పరీక్షలు చాలా ఖరీదు. ఇది వరకు కాగితాల బొమ్మలను చూపించి దృష్టి శాతాన్ని నిర్ధారించేవారు. ప్రస్తుతం డిజిటల్ మిషన్‌లను పెట్టి గోడపై విద్యుత్ తెరలను వినియోగిస్తున్నారు.

జిల్లాలో కంటి వైద్య సేవల సెంటర్లు

రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న కంటి వైద్య సేవల్లో అనేక రకాలైన నూతన విధి విధానాలను తీసుకువచ్చారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సామాజిక ఆస్పత్రులకు రిఫర్ చేసినవారికి శ్రీకాకుళం జిల్లా కేంద్రంలో ఉన్న రిమ్స్‌లో ఉచిత ఆపరేషన్‌లు నిర్వహిస్తున్నారు. ఇక జిల్లా వ్యాప్తంగా ఉన్న కంటి వైద్య సెంటర్లు ముఖ్యంగా పలాస ప్రభుత్వ సామాజిక ఆస్పత్రి, ఇచ్ఛాపురం, పాతపట్నం, రణస్థలం, ఆమదాలవలసలలో ఉన్నటువంటి ప్రభుత్వ సామాజిక ఆస్పత్రుల్లో ముఖ్యమంత్రి ఈ-ఐ కేంద్రాలు ఏర్పాటు చేశారు.

పేదలకు ఉచితంగా అద్దాలు

రేషన్ కార్డుతో అవసరం లేకుండా ఆధార్ కార్డు ప్రకారం ముఖ్యమంత్రి ఈ-ఐ కేంద్రాల్లో 60 ఏళ్లలోపు వారికి కంటి వైద్య పరీక్షలు చేయడంతో పాటు దృష్టిలోపం ఉన్న వారికి ఖరీదైన ఫైబర్ కళ్లద్దాలను అందజేస్తున్నారు. ఆ వ్యక్తి రంగును ఎంచుకుని కళ్లద్దాల నచ్చిన ఫ్రేమ్‌ను పొందవచ్చును. ఉచిత పరీక్ష లు ప్రభుత్వ సెలవుదినంలో తప్ప అన్ని రోజులు లభిస్తాయి. పాఠశాలలో చిన్నారులకు సైతం పరీక్షలు చేపట్టి వారికి ఉచిత కళ్లద్దాలను ఇక్కడి నుంచి పంపిస్తున్నారు. పరీక్షల్లో భాగంగా ఆపరేషన్ అవస రం ఉన్న వారికి ఉచితంగా ఎన్‌జీఓల ఆధ్వర్యంలో ఆపరేషన్‌లు నాణ్యతతో చేయిస్తున్నారు. ముఖ్యంగా శుక్లాల ఆపరేషన్, టెరిజం (పొర)ఆపరేషన్‌లు ఉచితంగా రిమ్స్‌లో సేవలు అందిస్తారు. ఇవే కాకుండా ప్రభుత్వ నుంచి మల్టీ విటమిన్ టాబ్లెట్‌లు, సిప్రాఫ్లాక్స్ చుక్కలు మందులు ఉచితంగా అందిస్తున్నారు.

సీహెచ్‌సీల వారీగా 2022 జనవరి నుంచి 2023 జూలై వరకు..	
పలాస సీహెచ్‌సీలో ఓపీ	6938
అద్దాలు అందుకున్నవారి సంఖ్య	5272
ఇచ్ఛాపురంలో ఓపీ	7395
అద్దాలు అందుకున్నవారు	5173
పాతపట్నంలో ఓపీ	7346
కళ్లద్దాలు అందుకున్నవారు	5238
ఆమదాలవలసలో ఓపీ	6805
కళ్లద్దాలు అందుకున్న వారు	4708
రాజాంలో ఓపీ	11605
కళ్లద్దాలు అందుకున్న వారు	9003
రణస్థలంలో ఓపీ	11,681
కళ్లద్దాలు అందుకున్న వారు	7489

క్లుప్తంగా

రైలు ఢీకొని ఒకరి మృతి

బాడంగి: మండలంలోని డొంకినవలస – బొబ్బిలి రైల్వేస్టేషన్ల మధ్యలో ఎత్తుఖానా దాటిన తరువాత 441 మైలురాయి వద్ద రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి శుక్రవారం సాయంత్రం మృతి చెందినట్టు రైల్వే పోలీసులు శనివారం తెలిపారు. మృతుడికి 50 నుంచి 55 మధ్య వయసు ఉంటుందని, మెడలో జంధ్యం, చేతికి రాఖీ ఉన్నాయని చెప్పారు. మృతదేహానికి కొద్ది దూరంలో విశాఖకు చెందిన సిల్వర్, జ్యులరీ పేరుతో చేతి సంచి ఉన్నట్టు రైల్వే పోలీసులు తెలిపారు. కాలికి గాయమై బ్యాండేజి కూడా ఉందని, తెలుపు, నలుపు, ఎరుపు రంగు కలిగిన గడుల హాఫ్ హ్యాండ్ షర్ట్, గోధుమ రంగు ప్యాంట్‌తో ఉన్నట్టు తెలిపారు. మృతదేహాన్ని స్థానిక సీహెచ్‌సీకి తరలించి, భద్రపరిచామని, ఆచూకీ తెలిసిన వారు 94410 13330 నంబరుకు సంప్రదించాలని సూచించారు. డొంకినవలస స్టేషన్‌మాస్టర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని విజయనగరం రైల్వే ఎస్‌ఐ శ్రీనివాసరావు తెలిపారు.

సీతంలో డ్రోన్ టెక్నాలజీ ఇన్నోవేషన్ సెంటర్



ఐసీడీటీ సీఈఓకి సత్కరిస్తున్న సీతం డైరెక్టర్ డాక్టర్ శశిభూషణరావు

విజయనగరం టౌన్: సీతంలో డ్రోన్ టెక్నాలజీ ఇన్నోవేషన్ సెంటర్ స్థాపనకు ఇన్నోవేషన్ సెంటర్ ఫర్ డ్రోన్ టెక్నాలజీస్ (ఐసీడీటీ)తో పరస్పర అవగాహన ఒప్పందానికి శనివారం చర్చలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ ఎం.శశిభూషణరావు మాట్లాడుతూ వ్యవసాయ రంగంలోనూ, రవాణా సౌకర్యాలు లేని చోట రవాణాకు సెర్చ్ అండ్ రెస్క్యూ ఆపరేషన్స్, రక్షణ శాఖ, ఆరోగ్య రంగం, రైల్వే తదితర రంగాల్లో ఎంతో ఉపయుక్తమన్నారు. ఇన్నోవేషన్ సెంటర్ సీఈఓ వెంకట సతీష్ మాట్లాడుతూ సెంటర్ స్థాపించడం ద్వారా విద్యార్థులకు డ్రోన్ టెక్నాలజీపై శిక్షణ ఇవ్వడంతో పాటూ ఇంటర్న్‌షిప్‌లు, ప్రాజెక్ట్‌లు, ప్రాంగణ నియామకాలకు అవకాశాలు కల్పిస్తామన్నారు. అనంతరం ఐసీడీటీ సీఈఓను కళాశాల డైరెక్టర్ దుశ్శాలువతో ఘనంగా సత్కరించారు. వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ ఓఆర్ఎమ్ రావు, ప్రిన్సిపాల్ డాక్టర్ డివి.రామమూర్తి సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

రాజాం రోడ్డు పనులు ప్రారంభం



పొక్లెయిన్‌తో రోడ్డు పనులు చేస్తున్న దృశ్యం

రేగిడి: రాజాం జీఎంఆర్ ఐటీ నుంచి సంకిలి వరకు రూ.9 కోట్ల వ్యయంతో చేపట్టిన డబుల్ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. మండలంలోని బూరాడ జంక్షన్ నుంచి రోడ్డుకు ఇరువైపులా జంగిల్ క్లియరెన్స్, రోడ్డు విస్తరణ లైనింగ్ పనులను శనివారం చేపట్టారు. ఆర్అండ్‌బీ ఏఈ నాగభూషణరావు పనులను పర్యవేక్షిస్తున్నారు.

డీఆర్వోగా అనిత బాధ్యతల స్వీకరణ

విజయనగరం ఫోర్ట్: జిల్లా రెవెన్యూ అధికారిగా ఎస్.డి.అనిత శనివారం కలెక్టర్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ డీఆర్వోగా పనిచేసిన గణపతిరావుకు శ్రీకాకుళం డీఆర్వోగా బదిలీ అయింది. ఆయన స్థానంలో అనిత ఇక్కడకు వచ్చారు. ఇప్పటి వరకు ఆమె విశాఖలోని ఏపీఐఐసీ జోనల్ మేనేజర్‌గా పనిచేశారు. గతంలో ఆమె జిల్లా పర్యాటక శాఖ అధికారిగా పనిచేశారు. ఆమెకు కలెక్టరేట్ ఏఓ, సిబ్బంది శుభకాంక్షలు తెలిపారు.

11న అప్రంటీస్ మేళా

విజయనగరం రూరల్: విజయనగరం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐలో ఈ నెల 11న అప్రంటీస్ మేళా నిర్వహిస్తామని ప్రిన్సిపాల్, జిల్లా కన్వీనర్ టి.వి.గిరి శనివారం తెలిపారు. వివిధ ట్రేడ్‌లలో ఐటీఐ ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు వెబ్‌సైట్‌లో వారి పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. వివరాలకు సెల్: 98491 18075, 98499 44654 నంబర్లను సంప్రదించాలన్నారు.

తాగునీటిని వృథా చేయొద్దు

రేగిడి: తాగునీటిని వృథా చేయవద్దని, ప్రతిఒక్కరూ నీటిని పొదుపుగా వాడుకోవాలని జల్ జీవన్ మిషన్ రాజాం సబ్‌డివిజన్ సభ్యుడు జి.సూరప్పనాయుడు, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ జి.శ్రీచరణ్ తెలిపారు. శనివారం మండలంలోని మజ్జిరాముడుపేటలో జల్ జీవన్ మిషన్ బృంద సభ్యులు తాగునీటి వాడకంపై మహిళలకు అవగాహన కల్పించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో గ్రామాల్లోని ఇంటింటికీ కుళాయిల ద్వారా తాగునీటిని అందించే బృహత్తర కార్యక్రమాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కరణం నిర్మల, పంచాయతీ కార్యదర్శి ఆకాస్వాతి, ఇంజినీరింగ్ అసిస్టెంట్ ప్రవల్లిక తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా కోడూరుమాత యాత్ర



మూడవ బలిపూజ సమర్పిస్తున్న విశాఖ అగ్రపీఠాధిపతులు మల్లవరపు ప్రకాశ్



బలి పూజలకు హాజరైన క్రైస్తవ భక్తజనం



కోడూరు మాతను దర్శించుకోవడానికి బారులు తీరిన భక్తులు

కోడూరు(బాడంగి): మండలంలోని కోడూరులో వెలసిన అద్భుత మరియ కోడూరుమాత యాత్ర కనులపండువగా శనివారం జరిగింది. మాతను దర్శించుకునేందుకు వేలాదిగా క్రైస్తవులు, ఇతరులు తరలివచ్చారు. కోడూరు ఫాదర్ యుగల్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన యాత్రకు ఉదయం నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. పుణ్యక్షేత్ర ఖాళీ స్థలంలో, పూజాబలుల సభాస్థలి వద్ద, ప్రార్థన మందిరం వద్ద, మాతను దర్శించుకునే గుహ వద్ద భక్తుల సందడి నెలకొంది. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖకు చెందిన డాక్టర్ రాయల విజయ్‌కుమార్, డాక్టర్ మల్లవరపు ప్రకాష్, డీనరి గురువులతో దివ్య బలి పూజలు చేపట్టారు. బొబ్బిలి డీఎస్పీ సుధీర్ పర్యవేక్షణలో బాడంగి ఎస్‌ఐ ఆర్.జయంతి, పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. వాహనాలను పిన్నవలస జంక్షన్ నుంచి ప్రవేశింపజేసి రామచంద్రాపురం మీదుగా పోనిచ్చి వన్‌వే ట్రాఫిక్ పాటించి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు.

కోతి దాడిలో 12 మందికి గాయాలు



కోతి దాడిలో గాయపడిన కుషాల్

నెల్లిమర్ల: నగర పంచాయతీ పరిధిలో కోతి దాడి చేసిన ఘటనలో 12 మందికి గాయాలయ్యాయి. శనివారం స్థానిక గాంధీనగర్ కాలనీ, శెగిడి వీధి, ధామస్‌పేటలో కోతి దాడి చేసి పలువురుని కరిచింది. స్థానికులు అందించిన వివరాలు.. ఎక్కడ నుంచో కోతి వచ్చిందని దానిని ఆదరించి ఆహారం పెడితే తిని పిల్లలతో ఆడుకుని ఒక్కసారిగా దాడి చేసి గాయపర్చినట్లు తెలిపారు. కోతి దాడిలో 12 మంది గాయపడి స్థానిక సీహెచ్‌సీలో చికిత్స తీసుకున్నారు. అధికారులు వెంటనే స్పందించి కోతి నుంచి కాపాడాలని కోరుతున్నారు.

విద్యుత్ షాక్‌తో రైతు మృతి



విద్యుత్ షాక్‌తో మృతి చెందిన పైడినాయుడు

మెరకముడిదాం: మండలంలోని ఇప్పలవలస గ్రామంలో విద్యుత్ షాక్‌కు గురై ఒక రైతు మృతి చెందిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. వివరాల్లోకి వెళ్తే.. ఇప్పలవలస గ్రామానికి చెందిన రైతు పైడినాయుడు శుక్రవారం రాత్రి తన పొలం చేసేందుకు వెళ్లాడు. అయితే అప్పటికే తెగిపడి వున్న విద్యుత్ తీగలను పైడినాయుడు గమనించక పోవడంతో ఆ తీగలు కాలికి తగిలాయి. దీంతో పైడినాయుడు విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. పొలానికి వెళ్లిన పైడినాయుడు ఎంతకీ ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పొలానికి వెళ్లి చూడగా పైడినాయుడు పొలంలో విగతజీవిగా పడి వుండడాన్ని గమనించి ఒక్కసారిగా గొల్లుమన్నారు. మృతుడికి భార్య సింహాచలం, ఇద్దరు కుమార్తెలు వున్నారు. పైడినాయుడు వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాడు. ఇప్పుడు కుటుంబ పెద్ద దిక్కు మృతి చెందడంతో తాము దిక్కులేని వాళ్లమయ్యామని కుటుంబ సభ్యులు రోదిస్తున్నారు. విషయం తెలుసుకున్న బుధరాయవలస హెడ్ కానిస్టేబుల్ వై.అప్పారావు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమో దు చేసి మృతదేహాన్ని చీపురుపల్లి సీహెచ్‌సీకి పోస్టు మార్టం నిమిత్తం తరలించారు.

సీఎం పర్యటన ఏర్పాట్లను ప్రారంభించండి

విజయనగరం ఫోర్ట్:

జిల్లాలోని ప్రభుత్వ వైద్యకళాశాల ప్రారంభోత్సవానికి ఈ నెల 15న ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి రానున్నారని, పర్యటన ఏర్పాట్లను వెంటనే ప్రారంభించాలని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అధికారులను ఆదేశించారు. ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీ దీపికతో కలిసి జేఎన్‌టీయూ కూడలి వద్ద ఉన్న హెలిప్యాడ్ ప్రాంతాన్ని సందర్శించారు. కార్యక్రమంలో జేసీ మయూర్ అశోక్ పాల్గొన్నారు.



హెలిప్యాడ్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన

ఎం.ఎస్.స్వామినాథన్ అవార్డు గ్రహీతకు సన్మానం

బొబ్బిలి: మండలంలోని మెట్టవలస గ్రామంలో ఎం.ఎస్.స్వామినాథన్ అవార్డ గ్రహీత, రైతు సాధికారత సంస్థ, ప్రకృతి వ్యవసాయ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ విజయ్‌కుమార్‌ను బొబ్బిలి వీణ, దుశ్శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం ప్రకృతి వ్యవసాయం వైపు రైతులను మళ్లించేందుకు ఆయన చేస్తున్న కృషిని వక్తలు కొనియాడారు. అంతకుముందు ఆయన ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను సందర్శించి, ప్రతీ రైతు ఆరోగ్యవంతమైన సమాజం కోసం ప్రకృతి వ్యవసాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో జేడీ కె.టి.రామారావు, ఆర్‌టీఎల్ ప్రకాష్, ఆర్‌టీవో హేమసుందర్, డీపీఎం ఆనందరావు, బొబ్బిలి ఏడీ ఎం.శ్యామసుందర్, మెట్టవలస సర్పంచ్ పువ్వల మాధవరావు, వైస్ ఎంపీపీ అరసాడ శంకరరావు, వీఏఏ రాజశేఖర్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది వాండ్రాసి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



విజయ్‌కుమార్‌ను సత్కరిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

తెర్లాం: పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా స్థానిక అంగన్‌వాడీ కేంద్రం-5లో పౌష్టికాహారంపై శనివారం అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కార్యకర్త వై.శ్రీదేవి కార్యక్రమానికి హాజరైన గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించారు. పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యమని, ప్రతిరోజూ పాలు, గుడ్లు, ఆకుకూరలు, కాయగూరలు, పప్పుదినుసులతో కూడిన ఆహారం తీసుకోవాలని, ఇలా చేస్తే రక్తహీనత, ఇతర రోగాల బారినపడకుండా ఆరోగ్యవంతులుగా ఉంటామని తెలిపారు.

హెచ్ఐవీపై అవగాహన అవసరం

- జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి డాక్టర్ సూర్యనారాయణ



మారథాన్‌ను ప్రారంభిస్తున్న డాక్టర్ సూర్యనారాయణ

విజయనగరం ఫోర్ట్: హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై ప్రతి ఒక్కరికి అవగాహన అవసరమని జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి డాక్టర్ ఎస్.సూర్యనారాయణ అన్నారు. స్థానిక విజ్జి స్టేడియంలో జూనియర్, డిగ్రీ విద్యార్థులకు జిల్లా స్థాయిలో శనివారం నిర్వహించిన రెడ్ మారథాన్‌ను జెండా ఊపి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెచ్ఐవీ వచ్చిన తర్వాత బాధపడే కంటే.. రాక ముందు జాగ్రత్త వహించాలని తెలిపారు. చెడు అలవాట్లకు దూరంగా ఉండి సత్ప్రవర్తన కల్గి ఉండడం ద్వారా హెచ్ఐవీ బారిన పడకుండా ఉండవచ్చునని తెలిపారు. అనంతరం రెడ్ రన్ మారథాన్ పోటీలో గెలుపొందిన వారికి నగదు బహుమతులను అందజేశారు. ప్రథమ స్థానంలో నిలిచిన పి.సాయి రూ.10 వేలు, ద్వితీయ స్థానం సాధించిన ఎస్.అశోక్‌కు రూ.7 వేలు, మరో ఏడుగురు విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.1000 చొప్పున అందజేశారు. కార్యక్రమంలో సాక్షి గోపాల్‌రావు, మూర్తి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అటవీ సంపదను పరిరక్షించాలి

- విశాఖ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్టు శ్రీకాంత్‌నాథ్‌రెడ్డి
- మన్యంలో సుడిగాలి పర్యటన

సీతంపేట: అటవీసంపద పరిరక్షణకు ప్రతిఒక్కరూ చర్యలు తీసుకోవాలని విశాఖరేంజ్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్టు శ్రీకాంత్‌నాథ్‌రెడ్డి అన్నారు. సీతంపేట మన్యంలో అటవీప్రాంతాన్ని శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా చిన్నబగ్గ టేకుప్లాంటేషన్‌ను సందర్శించి అక్కడ బేస్‌క్యాంపును ప్రారంభించారు. అటవీ వనాలను పరిశీలించారు. చెట్లు ఏఏ రకాలు ఉన్నాయి?, ఫారెస్టు పరిధి ఎంత విస్తీర్ణంలో ఉందనేది చూశారు. ఇక్కడ చెక్‌డ్యామ్‌ల నిర్మాణానికి ప్రతిపాదనలు ఉండడంతో ఎక్కడ ఏర్పాటుచేస్తే బాగుంటుందనేది చూశారు. అనంతరం దోనుబాయి రిజర్వ్ బీట్‌కు వెళ్లారు. అక్కడ గుగ్గిలం, టేకు తోటలను చూశారు. సిబ్బందికి పలు సూచనలిచ్చారు. ఇక్కడ విలువైన చెట్లు ఉన్నందున కాపాడాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. కార్యక్రమంలో శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం డీఎఫ్‌ఓలు నిషా కుమారి, ప్రసూన, అటవీరేంజర్లు, బీట్ ఆఫీసర్ దాలినాయుడు తదితరులు పాల్గొన్నారు.



సిబ్బందికి సూచనలిస్తున్న చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్టు

లోక్ అదాలత్‌లో 14,864 కేసుల పరిష్కారం



లోక్‌అదాలత్ నిర్వహిస్తున్న జూనియర్ జడ్జి రమ్య

- కేసుల పరిష్కారానికి లోక్‌అదాలత్ చక్కని వేదిక
- జిల్లా జడ్జి సాయికల్యాణ్ చక్రవర్తి



కక్షిదారులకు భోజనాలు వడ్డిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి కల్యాణ్‌చక్రవర్తి

సాక్షి ప్రతినిధి, విజయనగరం: రాజీయే రాజమార్గమని, జాతీయ లోక్‌అదాలత్‌లో కేసులను పరిష్కరించుకుంటే వ్యయప్రయాసలు తప్పుతాయని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవా సంస్థ చైర్మన్ బి.సాయికళ్యాణ్ చక్రవర్తి అన్నారు. జిల్లా కోర్టు ఆవరణలోని జిల్లా న్యాయ సేవాధికార సంస్థలో శనివారం జరిగిన జాతీయ లోక్ అదాలత్‌లో ఆయన మాట్లాడారు. లోక్ అదాలత్‌లో కేసులను పరిష్కరించుకుంటే శాశ్వత పరిష్కారం లభిస్తుందని, అప్పీల్ చేసుకునేందుకు కూడా అవకాశం ఉండదన్నారు. ఉమ్మడి విజయనగరం జిల్లాలోని కోర్టుల్లో నిర్వహించిన లోక్‌అదాలత్‌ల ద్వారా 14,864 కేసులు పరిష్కరించినట్టు వెల్లడించారు. అత్యధికంగా 209 మోటార్ ప్రమాదబీమా కేసులను పరిష్కరించి రూ.3,64,76,626 మొత్తాన్ని కక్షిదారులకు అందజేసినట్టు తెలిపారు. కేసుల నుంచి 40,222 మంది కక్షిదారులకు ఉపశమనం లభించిందన్నారు. కార్యక్రమంలో జడ్జిలు జి.రజని, ఎస్.దామోదర్‌రావు, సికిందర్ బాషా, ఎమ్.మీనాదేవి, కె.నాగమణి, బీహెచ్‌వీ లక్ష్మీకుమారి, బిరమ్య, కె.మోహిడెన్ జమురుత్ బేగం, సీహెచ్ దామోదరరామ్మోహనరావు పాల్గొన్నారు. కక్షిదారులకు మధ్యాహ్నభోజన సదుపాయం కల్పించారు.

జాతీయ లోక్‌అదాలత్‌లో పరిష్కరించిన కేసులు ఇలా...

కోర్టు	రాజీ అయిన కేసుల సంఖ్య
విజయనగరం	3.537
పార్వతీపురం	2,056
బొబ్బిలి	2,437
సాలూరు	1605
శృంగవరపుకోట	1088
గజపతినగరం	805
చీపురుపల్లి	1297
కొత్తవలస	1194
కురుపాం	308

మర్రివలస కొండ ఆక్రమణపై ఆర్‌డీఓ ఆరా!



కొండపైన చదును చేసిన భూమిని పరిశీలించి జేసీబీ డ్రైవర్‌తో మాట్లాడుతున్న తహసీల్దార్, డీటీ

దత్తిరాజేరు: మండలంలోని మర్రివలస కొండ వెనుక భాగం సర్వే నంబరు వన్‌లో మెంటాడ మండలం కుంటినవలస రైతులు ఆక్రమణ చేయడంతో బొబ్బిలి ఆర్‌డీఓ శేష శైలజ శుక్రవారం రాత్రి ఆరా తీశారు. అసలు అక్కడున్న భూములను ఎందుకు చదును చేస్తున్నారో పరిశీలనకు కొండపైకి వెళ్లిన తహసీల్దార్ గురుమూర్తి, డిప్యూటీ తహసీల్దార్ రమేష్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ విషయమై తహసీల్దార్, డీటీ శనివారం మాట్లాడుతూ కొండపై భూమిని చదును చేసిన జేసీబీని పోలీస్‌లకు అప్పగించడం జరిగిందని అన్నారు. బుధ, గురువారాల్లో సుమారు 50 ఎకరాలపైన చదును చేసిన జేసీబీనీ 20 మందికి పైగా రైతుల పేర్లు కూడా సిబ్బంది ద్వారా సేకరించడం జరుగుతుందని చెప్పారు. అక్కడకు రాత్రి సమయాలలో ఇతరులు రాకుండా రెవెన్యూ, పోలీస్ సిబ్బందిని కాపలాగా ఉంచామన్నారు.

ఇదీ అసలు కథ

ఏడేళ్ల కిందట మర్రివలస రెవెన్యూ పరిధిలోని కొండపైన నిర్మించిన 420 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి స్థల సేకరణ చేసినప్పుడు కూడా డీ–పట్టా భూములకు కుంటినవలసకు చెందిన రైతులే నష్ట పరిహారం అధిక మొత్తంలో పొందారు. ఇటీవల గిరిజన యూనివర్సిటీకి 561.91 ఎకరాలు స్థల సేకరణ చేయగా అందులో 180 ఎకరాలు మాత్రమే జిరాయితీ కాగా మిగిలిన డి–పట్టా భూములలో మూడొంతులు నష్ట పరిహారం రూ.కోట్లు కుంటినవలస రైతులకే చెల్లించారు. దీన్ని గుర్తించిన గ్రామస్తులు ఇప్పుడు కూడా ప్రభుత్వం కొత్తగా నిర్మాణాలు చేపడితే కొండ ప్రాంతాల్లో ఉన్న భూములనే సేకరిస్తుందని, మళ్లీ ప్రభుత్వ ధనాన్ని సులభంగా పొందవచ్చని ఆలోచనతోనే ఇలా కొందరు చేస్తున్నారని మరడాం, మర్రివలస గ్రామస్తులు ఆరోపించారు. ఇటువంటి వారిపై తగు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

వైద్యకళాశాల జిల్లా ప్రజలకు వరం



వైద్య విద్యార్థులతో మాట్లాడుతున్న మంత్రి విడదల రజని

- ప్రైవేటు వైద్య కళాశాలలకంటే మిన్నగా నిర్మాణం
- ఈనెల 15న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వైద్య కళాశాలను ప్రారంభిస్తారు
- రూ.8,500 కోట్ల ఖర్చుతో రాష్ట్రంలో 17 వైద్య కళాశాలల ఏర్పాటు
- రాష్ట్ర మంత్రులు విడదల రజని, బొత్స సత్యనారాయణ



వైద్య విద్యార్థులు

విజయనగరం ఫోర్ట్: వైద్య కళాశాల జిల్లాలో ఏర్పాటు కావడం జిల్లా ప్రజలకు వరమని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజని పేర్కొన్నారు. జిల్లా ప్రజల చిరకాల స్వప్నాన్ని సాకారం చేస్తూ ఈ నెల 15వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి ప్రారంభిస్తారని తెలిపారు. ఇక్కడి నుంచే రాజమండ్రి, మచిలీపట్నం, నంద్యాల, ఏలూరులోని వైద్య కళాశాలలను వర్చువల్ విధానంలో ప్రారంభిస్తారన్నారు. మంత్రులు ఇద్దరూ గాజులరేగలోని ప్రభుత్వ వైద్య కళాశాలను శనివారం సందర్శించారు. ప్రభుత్వ వైద్య కళాశాలలో నిర్మించిన బయో కెమిస్ట్రీ, అనాటమీ, హిస్టలాజీ ల్యాబ్‌లను పరిశీలించారు. అనంతరం లెక్చరర్ గ్యాలరీని పరిశీలించారు. వైద్య విద్యార్థులతో ముచ్చటించారు. వైద్యకళాశాలలో వసతులు, విద్యాబోధన, హాస్టల్ సౌకర్యంపై ఆరా తీశారు. సౌకర్యాలు బాగున్నాయని విద్యార్థులు చెప్పడంతో సంతోషించారు. వైద్య విద్య అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రపంచ స్థాయి ప్రమాణాలతో కళాశాలను నిర్మిస్తున్నట్టు వెల్లడించారు. ప్రైవేటు కళాశాలల కంటే మిన్నగా మౌలికవసతులు కల్పించామన్నారు. వైద్య విద్యను చేరువచేస్తూ రాష్ట్రంలో 17 వైద్య కళాశాలలను సుమారు రూ. 8,500 కోట్ల ఖర్చుతో నిర్మించేందుకు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి నడుంబిగించారన్నారు. దీనిలో భాగంగా తొలివిడత నిర్మాణం పూర్తయిన ఐదు వైద్యకళాశాలల్లో ఈ ఏడాది నుంచి తరగతులు ప్రారంభమయ్యాయన్నారు. డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి మాట్లాడుతూ ఎంతో కష్టపడి మెడికల్ సీట్లు సాధించిన విద్యార్థులు చక్కగా చదువుకుని ఉన్నతస్థాయికి ఎదగాలన్నారు. తల్లిదండ్రుల ఆశయాలను నేరవేర్చాలని పిలుపునిచ్చారు. కళాశాలలో చేరిన మొదటి బ్యాచ్ విద్యార్థులకు ఎప్పుడూ గుర్తింపు ఉంటుందన్నారు. రాష్ట్రానికి ఎక్కువ వైద్య కళాశాలలను తెచ్చినందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి పేరు వస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వి.టి.కృష్ణబాబు, ఏపీఎంఎస్ ఐడీసీ ఎం.డి.మురళీధరరెడ్డి, కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీ ఎం.దీపిక, జేసీ మయూర్‌అశోక్, వైద్యకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. పద్మలీల, సూపరింటిండెంట్ డాక్టర్ అప్పలనాయుడు, డీఎంహెచ్‌ఓ డాక్టర్ భాస్కరరావు, ఆర్డీఓ సూర్యకళ పాల్గొన్నారు.

ఏనుగుల సంచారంపై అప్రమత్తతే ప్రధానం

పార్వతీపురం: ఏనుగుల గుంపు నుంచి విడిపోయిన ఏనుగు 'హరి' ప్రస్తుతం కురుపాం మండలం బొడుకొండ రిజర్వ్ ఫారెస్ట్‌లో ఉందని జిల్లా అటవీ అధికారి జీఏపీ ప్రసూన శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. కొత్త బల్లుకోట, బల్లుకోట, టేకర్కండి, రావాడ, లక్ష్మీపేట, పెళ్లివలస, మంత్రజోల, మర్రిగూడ, సర్యానగరం, గొటువాడ గ్రామాల్లో సంచరించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని, ఆయా ప్రాంతాల ప్రజలు, ప్రయాణికులు అప్రమత్తంగా ఉండాలన్నారు. రాత్రులు కురుపాం–గుమ్మలక్ష్మీపురం ప్రధాన రహదారిని దాటే అవకాశం ఉంటుందని, ప్రయాణికులు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. మిగిలిన ఏడు ఏనుగులు కల్లికోట ముంపుడు ప్రాంతంలో ఉన్నాయని, పాలకొండ ప్రాంతం నుంచి వచ్చిన నాలుగు ఏనుగులు కురుపాం రేంజ్ జరడ గ్రామం వద్ద ఉన్నట్టు ప్రకటనలో తెలిపారు. పంట నష్టపోయిన రైతులు నష్టపరిహారం కోసం దరఖాస్తులను అటవీ రేంజ్ అధికారికి అందజేయాలని కోరారు.

హోరాహోరీగా...



అథ్లెటిక్స్ క్రీడాకారుల ఎంపిక పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

- అథ్లెటిక్స్ జిల్లా క్రీడాకారుల ఎంపిక పోటీలు

విజయనగరం: రాష్ట్ర స్థాయిలో జరగనున్న జూనియర్స్ బాల, బాలికల అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొనబోయే జిల్లా క్రీడాకారుల ఎంపిక పోటీలు శనివారం ఉత్సాహభరిత వాతావరణంలో సాగాయి. జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విజ్జి స్టేడియం ప్రాంగణంలో నిర్వహించిన ఎంపిక పోటీలకు జిల్లా నలుమూలల నుంచి 500 మంది క్రీడాకారులు హాజరయ్యారు. వీరికి పరుగు, హైజంప్, లాంగ్‌జంప్, షాట్‌పుట్, జావిలిన్‌త్రో తదితర అంశాల్లో పోటీల్లో నిర్వహించారు. ఎంపిక పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు ఈనెల 21వ తేదీ నుంచి 23వ తేదీ వరకు ఏలూరులోని ఏఎస్ఆర్ స్టేడియంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు పంపిస్తామని జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి లీలాకృష్ణ తెలిపారు. ఎంపిక పోటీలకు టెక్నికల్ అఫీషియల్స్‌గా వ్యాయామ ఉపాధ్యాయులు గౌరీశంకర్, తవిటినాయుడు, ఆనంద్ కిశోర్, గణేష్, బాబ్జి, రామకృష్ణ, గురునాయుడు, కోచ్‌లు శ్రీకాంత్, మధు, నర్సింగ్ వ్యవహరించారు.